# రాజకీయాధికారం కోసం పోటీలో మరింత దిగజారిన పాలకవర్గ పార్టీలు

**రాష్ట్రవిభజన,** రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు జరిగి నాలుగు సం॥లు గడిచిపోయింది. ఆనాటినుండి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, తెలంగాణాలో టిఆర్ఎస్ అధికారంలో కొనసాగుతూ వస్తున్నాయి. 2019 సం॥లో అంటే ఒక ఏడాదిలోపుగానే ఇరు రాష్ట్రాల అసెంబ్లీలకు, దేశపార్లమెంటుకు మరో విడత ఎన్నికలు జరుగబోతున్నాయి. రాష్ట్రవిభజన కారణంగా తలెత్తిన సమస్యలపట్ల చిత్తశుద్ధితో వ్యవహరించకపోగా, అనేక సమస్యలు ఈనాటికీ పరిష్కరించాల్సినవిగా వున్నాయి.

ఉద్రిక్తత రగిలించే అలాంటి అంశాలలో కృష్ణా – గోదావరీ జలాల పంపకం సమస్య ఒకటి. రాష్ట్రవిభజనకు ముందుగానే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తన తీర్పునిస్తూ నదీ పరివాహక ప్రాంతంలోని నాలుగు రాష్ట్రాల మధ్య జలవనరులను పంపిణీచేస్తూ కేటాయింపులు చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నదీ జలాలను కొత్తగా ఏర్పడిన ఏ.పి., తెలంగాణా రాష్ట్రాల మధ్య పంపకం చేసే కర్తవ్యాన్ని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగిస్తూ, దాని కాలవ్యవధిని పెంచారు. ప్రస్తుతం కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాలన్నీ జలాల కేటాయింపుపై ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. కాగా, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఈ తీర్పు 4 సం॥ల తర్వాత ఈనాటికీ అమలుకు నోచుకోకుండా వుంది.

రాష్ట్రవిభజనకు నిర్ద్వంద్వంగా మద్దతు తెలిపిన బిజెపి, నూతనంగా ఏర్పడిన ఇరు రాష్ట్రాలకు అన్ని సహాయ సహకారాలు అందజేస్తానని వాగ్దానం చేసింది. అయితే, బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక, అసంతృప్తి బీజాలు నాటటానికి పూనుకుంది. ట్రిబ్యునల్ సిఫార్సుల స్ఫూర్తిని ప్రక్కనబెట్టింది. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌ఘడ్, ఒడిషా రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన నదీ జలాల యాజమాన్య బోర్డులు తప్పనిసరిగా ఏర్పరచవలసియుండగా, వాటిని ఏర్పరచలేదు. కేవలం ఏ.పి. మరియు తెలంగాణా రాష్ట్రాల ప్రతినిధులతో మాత్రమే నదీజలాల యాజమాన్య బోర్డు ఏర్పరచింది. ఈ బోర్డులో పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండా, తీర్పు అమలును అసాధ్యం చేస్తోంది. ఫలితంగా నదీపరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాలన్నింటా ఆరని సమస్యను రగుల్చుతూ వుంది. రాష్ట్రప్రభుత్వ మరియు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల విభజన వంటి సాధారణ సమస్య సైతం ఇరురాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా వుండిపోయింది. దక్షిణ భారతదేశంలో అధికారాన్ని చేజిక్కించుకొనే ప్రయత్నంలో రెక్కలు సాచి సిద్ధంగావున్న బిజెపి, ఈ సమస్యలను ఉపయోగించుకొని పాలకపార్టీలకు – ప్రత్యేకించి ఏ.పి.కి ఇబ్బందులు కలిగించాలని భావిస్తోంది.

టిడిపి, టిఆర్ఎస్‌లు తాము పెంపొందించిన ప్రాంతీయ సెంటిమెంట్‌ను ఉపయోగించుకొని ఏపి, తెలంగాణాలలో అధికారంలోకి వచ్చాయి. ఈ ప్రభుత్వాలు రెండూ మొండిగా వ్యవహరిస్తూ తమకు ప్రత్యర్ధి పార్టీలే వుండరాదనే విధంగా వ్యవహరిస్తున్నాయి. తమ రాజకీయ, ఆర్ధిక, అంగబలాన్ని ప్రయోగించి ప్రత్యర్ధి పార్టీల ఎంఎల్‌ఏలను, నాయకులను వీరు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో తుడిచిపెట్టుకుపోగా, టిడిపివైపు తమ ఎంఎల్‌ఏలు అధిక సంఖ్యలో వెళ్ళిపోవటంతో వైయస్సార్‌సీపి బాగా దెబ్బతిన్నది. తెలంగాణాలో టిడిపి ఎంఎల్‌ఏలు అధికసంఖ్యలో టిఆర్ఎస్‌లోకి వెళ్ళిపోగా, కాంగ్రెస్ ఇంకా తన పరపతి ప్రాంతాలను కొన్ని కలిగి వుంది. సి.పి.ఐ, సిపిఎం మరియు కొన్ని విప్లవపార్టీలు కూడా వారి శ్రేణులను భారీగా నష్టపోయాయి. ఈ స్థితి అటు టిఆర్ఎస్‌ను ఇటు టిడిపిని నిరంకుశంగా మార్చింది. భిన్నాభిప్రాయాలను, ప్రజలను అణగద్రొక్కేందుకు వారు తమ కోరలను సాచటం ప్రారంభించారు.

రాష్ట్రంలో చంద్రబాబునాయుడు మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రజల పరిరక్షకుడిగా పోజుపెడుతూ అట్టహాసపు పథకాలను సిద్ధంచేస్తూ, తాను సువర్ణాంధ్రప్రదేశ్ నిర్మిస్తానని ప్రకటిస్తున్నాడు. ఈ ప్రచారార్భాటం వాస్తవాలను మరుగుపరచకపోవటంతో, చంద్రబాబు ప్రజల ఆగ్రహానికి గురవుతున్నాడు. రాజధాని, మౌలిక వసతులు, పారిశ్రామిక అవసరాల పేరుతో కేవలం స్వార్ధప్రయోజనాలకు ఉపయోగించేందుకు లక్షలాది ఎకరాల భూములను రైతాంగం నుండి సేకరించాడు. చంద్రబాబు ఎన్‌డిఏలో చేరి, కేంద్రం నుండి అధికంగా నిధులు రాబట్టుకునే ఆశతో మోడీని ప్రసన్నం చేసుకోవాలనుకున్నాడు. ప్రజల జీవనాధారాలను సర్వనాశనం చేసిన పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ వంటి మోడీ ప్రభుత్వ అన్ని చర్యలను చంద్రబాబు సమర్ధించాడు. ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలికసమస్యా పరిష్కారం కాలేదు; కాకపోగా అవి మరింత తీవ్రమయ్యాయి. అత్యధిక రైతాంగం తీవ్ర నిస్పృహకు గురైవున్నారు. ప్రభుత్వం వారికేమాత్రం ఉపశమనం కల్పించే చర్యలు కూడా చేపట్టటం లేదు. కార్మిక చట్టాలన్నింటినీ అటకెక్కించి యజమానులకు పూర్తి స్వేచ్ఛ నివ్వటంతో కార్మికవర్గం దుర్భర స్థితినెదుర్కొంటోంది. అద్వితీయ నైపుణ్యాభివృద్ధిగా ప్రభుత్వం పేర్కొంటూ విద్య, వైద్య రంగాలలో చేపడుతున్న ప్రైవేటీకరణ చర్యలు మధ్యతరగతి వర్గాలపై పెనుభారం మోపుతున్నాయి.

ప్రజల ముందుంచటానికి వైయస్సార్ సిపికి నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయం లేకపోయిన కారణంగా అది గందరగోళంలో వుంది. అన్నిరకాల సమస్యలకూ టిడిపిని నిందించటమే దానికున్న ఒకే ఒక్క ఎజెండా. ఒక ఆరోపణ తర్వాత మరో ఆరోపణను దృఢమైనవా, కావా అనే దానితో నిమిత్తంలేకుండా చేసుకుంటూ వెళుతోంది. వైయస్సార్ సిపి నాయకుడు జగన్మోహనరెడ్డి ప్రజాకర్షక వాగ్దానాలెన్నింటినో ప్రజలపై కుమ్మరిస్తున్నాడు. తమ తమ ఓటు బ్యాంకులను సంఘటితపరచుకునేందుకు టిడిపి, వైయస్సార్ సిపీలు రెండూ కులాన్ని, మతాన్ని ఆధారం చేసుకొని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ 2014 అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుండి ఇంకా కోలుకోలేదు. నాయకులలో అధిక సంఖ్యాకులు టిడిపివైపు వెళ్ళిపోవటంతో కాంగ్రెస్ ఖాళీ అయింది.

నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిని అదుపుచేసేందుకు కాంగ్రెస్ ఉన్నతస్థాయి నాయకత్వం గతంలో కాపు కులనాయకునిగా చిరంజీవిని రాజకీయ వేదికపైకి తీసుకువచ్చిన విధంగానే, అతని తమ్ముడు పవన్‌కళ్యాణ్ రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు ముందుకొచ్చాడు. టిడిపిని బలహీనపరిచేందుకు బిజెపి ఆయనను రంగంలోకి తెచ్చిందని అనేకమంది రాజకీయ నిష్ణాతులు అభిప్రాయపడ్తున్నారు.

సిపిఐ, సిపిఎంలు తమ వర్గ సంకర విధానాలతో శ్రామిక ప్రజలలో తమ స్థానాలను కోల్పోయిన ఫలితంగా రానున్న ఎన్నికలలో అవి ఏ పార్టీతో జతకట్టాలనే అంతులేని సందిగ్ధంలో వున్నాయి.

తమిళనాడులో ప్రజల మానసిక స్థితిని గమనించిన బిజెపి నాయకత్వం, అక్కడ అధికారాన్ని దక్కించుకోవటానికి సిగ్గుమాలిన విధానాలు చేపట్టి, తద్వారా తమిళనాడులో రాజకీయ ఆధిపత్యం సాగించాలనుకుంది.

టిడిపి క్రమంగా బిజెపికి దూరమౌతూ వచ్చి, అంతిమంగా కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం నుండి వైదొలిగింది. రాష్ట్రం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికి బిజెపీనే కారణంగా ఆరోపిస్తూ వస్తోంది. బిజెపీ వాటినన్నింటినీ తిప్పిగొడుతోంది. హద్దులేమీ లేకుండా ఆరోపణల పర్వాన్ని ఇరువైపులనుండి కొనసాగిస్తున్నారు.

ఏపికి ప్రత్యేక తరగతిహోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఏపికి ప్రత్యేకరైల్వే జోన్, 15వ ఆర్థికసంఘం సూచనల అమలు మొదలైన అంశాలపై ప్రాథమికంగా వివాదం ప్రారంభమై కేంద్రీకృతమౌతోంది. ఈ అంశాలన్నీ బిజెపి సహకార సమాఖ్యగా నిర్వచించిన కీలకమైన కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ సంబంధాల అంశం చుట్టూ అల్లుకుని వున్నాయి. ఈ అంశాలు రాష్ట్రప్రభుత్వాల పనితీరును దెబ్బతీసేవిగా, ప్రజల జీవితాలకు నష్టకరమైనవిగా వున్నాయనేది నిరాకరించవీలులేని వాస్తవం. దీనిపై లోతైన చర్చ జరగవలసి వుంది.

భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, దీనికి సమాఖ్య స్వభావం వుందనేది ఒట్టిదే. గత 68 సం॥లుగా, వరుసగా కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన ప్రభుత్వాలన్నీ రాష్ట్రాలను ఎండగట్టి, ఎక్కువ అధికారాలను తమ చేతులలో కేంద్రీకృతం చేసుకోవటమే జరిగింది. నరేంద్రమోడీ ఈ అంశంలో మరింత మొండిగా వ్యవహరిస్తున్నాడు. ఒక్క కలంపోటుతో అమలులోకి తెచ్చిన జిఎస్‌టితో ఎన్నో రాష్ట్రాల ఆర్థికవ్యవస్థలను మూలకు నెట్టివేశాడు. 15వ ఆర్థిక సంఘం సూచనలను మోడీ ప్రభుత్వం ఎలా రూపకల్పన చేసిందంటే, రాష్ట్రాలన్నీ తమ ఆర్థిక అవసరాలకు కేంద్రంపై ఆధారపడి వుండాల్సి వస్తోంది. ఈ అంశాలన్నీ ప్రజలమధ్యకు తీసుకువెళ్ళి చర్చజేయటంద్వారానే, కేంద్ర – రాష్ట్రాల సంబంధానికి ఒక పరిష్కారం లభించగలుగుతుంది.

అయితే పాలకవర్గ పార్టీల ఉద్దేశ్యం ఇది కాదు. తమ మధ్య వైరుధ్యాలు తీవ్రమవటంతో అవి ఈ అంశాలను లేవనెత్తుతున్నాయి. అయినప్పటికీ, ఈ సమస్యలో ప్రజలజోక్యం పెరుగుతుందని వారికి భయంగా వుంది. అందుకే ప్రజలమధ్య గంభీరమైన చర్చ జరగకుండా వారు ప్రక్కదోవ పట్టించజూస్తున్నారు; వ్యక్తిగత ఆరోపణలు, కులపరమైన అంశాలు, మత భావోద్వేగాలతో ఆ చర్చకు విఘాతం కల్గిస్తున్నారు. మతపరమైన భావోద్వేగాలను రేపటానికి తాము పవిత్రంగా భావిస్తామనే తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కూడా వారు వివాదంలోకి దించారు.

ఈవిధంగా పాలకవర్గాలు తమ రాజకీయ ప్రతినిధులద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్యపై చర్చజరగకుండా చాకచక్యంగా మినహాయించి, రాబోయే సార్వత్రిక ఎన్నికల ఎజెండాను రూపొందించారు. వారు గీసిన గీత లోపలనే రాజకీయచర్చగా పేర్కొనేది ఏదైనా జరిపే విధంగా చూస్తున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలన్నీ వివిధ రాజకీయ పార్టీల నాయకుల యాజమాన్యంలో నడుస్తున్నవే. వారికి విధింపబడిన పరిమితులను అధిగమించరాదనే నియమాన్ని వారందరూ పాటిస్తున్నారు.

దేశ, ప్రాంతీయ స్థాయిలలో పాలకవర్గాల, వారి రాజకీయ ప్రతినిధుల దివాళాకోరుతనాన్ని రాష్ట్రంలోని ప్రజాతంత్ర విప్లవశక్తులు వెల్లడిచేయాలి. రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న వాస్తవిక సమస్యలను, వాటి పరిష్కారమార్గాలను ముందుకు తేవటం ద్వారా ప్రజల చైతన్యాన్ని పెంపొందించాలి.

ooooo